# ప్రజారాజ్యం

లోక్‌సత్తా 'ఇ' సమాచారపత్రం

ప్రజలే ప్రభువులు

సంపుటి : 1

సంచిక : 7

ఏప్రిల్ 1-15 ,2006


# మానవీయ విలువల కోసం పోరాడిన అంబేద్కర్

## తాడిగడప విగ్రహావిష్కరణ సభలో జయప్రకాష్ నారాయణ్ ప్రసంగం

సార్వజనీన విలువల కోసం బతికి, దానికోసం పోరాడిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్. అంబేద్కర్ ఒక కులానికో, వర్గానికో నాయకుడు కాదు. అంబేద్కర్‌ను దళిత నాయకుడు అని చెప్పడం అంటే గాంధీజీని గుజరాతి వైశ్యుడు అని, నెల్సన్ మండేలాను నల్లజాతి నాయకుడు అని చెప్పుకున్నట్టు ఉంటుంది. ఇది మనల్ని మనం అవమానించుకోవడమే. విలువల కోసం కృషి చేసిన మణిదీపాల్లో అంబేద్కర్ ఒకరు అని డా॥ జె.పి. పేర్కొన్నారు. కృష్ణాజిల్లా తాడిగడప గ్రామంలో డా॥ అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి ప్రసగించారు.

"రాజ్యాంగం అనగానే అంబేద్కర్ గుర్తుకు వస్తారు. కానీ రాజ్యాంగ పవిత్రతను కాపాడడానికి చేసిన కృషి, ఆర్తి, దూరదృష్టి అర్థం కావు. ప్రపంచంలో మొదటి లిఖిత రాజ్యాంగం అమెరికా రాజ్యాంగం. మానవ విలువల గురించి, సార్వజనీనం గురించి కవిత్వం చెప్పిన రాజ్యాంగం, స్వేచ్ఛను ఆకాశానికి ఎత్తిన రాజ్యాంగం. కాని నల్లజాతి వాళ్ళు మనుష్యులు అనే విషయాన్ని మరచిపోయారు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన 70 ఏళ్ళ తర్వాత వారిని గుర్తించారు.

రాజ్యాంగం రాస్తున్న కాలంలో అమెరికా రెండో అధ్యక్షుడు జాన్ఆడమ్ భార్య ఆయనకి ఒక ఉత్తరం రాశారు. మీ రాజ్యాంగంలో మహిళలను మరిచిపోవద్దని ఆమె రాసిన ఉత్తరాన్ని ఆయన భద్రంగా దాచారు కానీ మహిళలకు ఎటువంటి హక్కులు కల్పించలేదు. 1920వ దశకం లో తొలిసారిగా వారికి ఓటు హక్కు కల్పించారు.

మన రాజ్యాంగం మాత్రం మహిళలకు, దళితులకు కుటుంబంతో, పుట్టుకతో మతంతో సంబంధం లేకుండా ఓటు హక్కు కల్పించిన మొట్టమొదటి లిఖిత రాజ్యాంగం. ఇది ఆనాడు గొప్ప విప్లవం. అనూహ్య విప్లవం.

మన రాజ్యాంగంలో రాసుకున్న రిపబ్లిక్ ను నేడు మనం కోల్పోయాం దాన్ని మనం నిలబెట్టుకోవాలి. మన రాజ్యాన్ని మనం సొంతం చేసుకోవాలి. రాజకీయాల అర్థం మర్చాలి. జనం రాజకీయాల చుట్టూ తిరగడం కాదు. జనం చుట్టూ రాజకీయాలు తిరిగేలా మార్పు రావాలి. జన జీవనాన్ని ప్రభావితం చేసే విధంగా రాజకీయాల్ని మార్చాలి. కండబలం, ధనబలం, ఉన్న వాళ్ళకు మాత్రమే పరిమితమైన రాజకీయాల్ని మార్చాలి. ఎవరు అధికారంలోకి వచ్చినా మనకు వచ్చిన లాభం లేదు. 'చచ్చినోడి పెళ్ళికి వచ్చిందే కట్నం' అన్న విధంగా రూ. 200లో 300లో తీసుకుని ఓటు వేసే విధానం పోవాలి. మనకు వంద రూపాయలు ఇచ్చి ఓటు కొనుక్కుని 10 కోట్లు ఆర్జిస్తున్నారు.

ఇదంతా చూస్తూ మనది కాదులే అని కూర్చుంటే దేశం మారదు. మనం రోజు వారీ ఉపయోగించుకుంటున్న వాటికోసం మనం ప్రశ్నించకుండా మార్పు ఎలా వస్తుంది. మనం బస్సులో ప్రయాణం చేస్తూ బస్సులో సౌకర్యాల కోసం అడగకపోతే, విమానంలో ప్రయాణించే వ్యక్తి అడుగుతాడా? పట్టించుకోవాల్సిన వాళ్ళకు అవసరం లేదు. అవసరం ఉన్నవాళ్ళు పట్టించుకోరు. రాజకీయాలలో మార్పు రావాలి. రాజకీయాలు మన విద్యచుట్టూ తిరగాలి, మన ఆరోగ్యం చుట్టూ తిరగాలి. ఈ మార్పు వచ్చిననాడు మనం రాబోయే తరం భవిష్యత్తును వేయగలం. అందరికి ఉపాధి హామీ, ఆరోగ్యం అందివ్వగలం. ఆ మార్పు కోసం మంచి రాజకీయం కోసం కృషి చేయాలని కోరుకుంటున్నాను" అంటూ డా॥ జె.పి. తన ప్రసంగాన్ని ముగించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ప్రిన్సిపల్ కార్యదర్శి బి. దానం, కార్మిక ఉపాధి మంత్రిత్వశాఖ ప్రాంతీయ సంచాలకులు పి. అంబేద్కర్, " అన్నదాత మణి" ఎన్.ఆర్.ఐ. ఆసుపత్రి ఇ.ఎన్.టి. అధికారి నానయ్య,పెనమలూరు డిప్యూటీ ఎమ్మార్వో శివరాం, స్వయం కృషి స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు మాణిక్యాలపల్లి శ్రీనివాసరావు, నారిన శ్రీనివాసరావు, మైనేని రాజశేఖర్, తిప్పిరెడ్డి వెంకటరెడ్డి, పానుగమాడు రమేష్, పానుగుమాటి ప్రకాష్, గుండాల గురవయ్య, స్థానిక పెద్దలు, పెద్దసంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# లోక్‌సత్తా జెండాలెత్తి.....

-నిసార్



పల్లవి : ఏదిరో ! యువతరం
ఉడుకు నెత్తురెటుబాయె
ఏదిరో ఈ తరము
పౌరుషమెక్కడబాయె
ఏదిరో నవతరము
అల్లూరి భగత్ సింగు, ఆదర్శాలెటుబాయె
గాంధీ అంబేద్కరుల రాజకీయం ఏమాయె ॥ ఏదిరో ॥

పల్లెల్లో మన చదువు పనికిరానిదైపాయె
పేరుకు ఊరేగాని దెరువు కరువాయె
ఎందరో పాలించిన ఎదుగు బొదుగు లేదాయె
చేతికి ఎదిగినోడ చెయి జాపి బతుకుడేల ॥ ఏదిరో॥

కుటిల పరుల చేతజిక్కి రాజకీయం కుళ్ళిపాయె
పదవి చుట్టె తిరుగడాయె పై రవీలే చేసుడాయె
ఓట్లుకొని పదవి పట్టి ప్రజల సొమ్ము దోచుతుంటె
ఈ దారి మార్చెటోల్లు ఊరిలోన కరువైరి ॥ ఏదిరో ॥

పల్లె చుట్టు అవినీతి పుట్టలల్లె పెరుగబట్టె
పథకాల డబ్బంత పాలకులె మింగవట్టె
పల్లె ప్రగతి నోచదాయె బతుకు బీడు బారిపోయె
గల్లినుంచి ఢిల్లీదాక గిదే తంతు సాగుతుంటె ॥ ఏదిరో॥

అవినీతి పుట్టలను నేలమట్టం జెయ్యంగ
కుళ్ళిన రాజకీయం కొత్తగ మార్చేయంగ
ప్రజల మేలుకోరే ఏలుబడిని సాధించగ
ఇదిగో లోక్‌సత్తా యువశక్తిని పిలుస్తోంది
లెండిరో - యువజనులు-కొత్త రాజకీయానికై
రండిరో - యువజనులు - లోక్‌సత్తా జెండాలై
కండగల గుండెగల - యువకులంత దండుగట్టి
లోక్‌సత్తా జెండాలెత్తి-ఉద్యమించ నడవండి ॥ ఏదిరో ॥

# క్షీణ రాజకీయాలకు విరుగుడు మంచి రాజకీయాలే

-డి. సోమసుందర్

రాజకీయం అనే మాటకు వ్యవహారికంలో పెడర్థాలు స్థిరపడిపోయివున్నాయి. మీ అమ్మాయికి కాలేజి సీటు ఎందుకు రాలేదని మనం ఎవరినన్నా ప్రశ్నిస్తే రాజకీయం జరిగిపోయిందన్న సమాధానం వస్తుంది. ఇంటర్వ్యూ బాగా చేసినా ఉద్యోగం ఎందుకు రాలేదంటే, 'రాజకీయం సార్' అనడం సర్వసాధారణం. మీకు బ్యాంకు లోను ఎందుకు రాలేదన్నా, డ్వాక్రాగ్రూప్‌కి రివాల్వింగ్ ఫండ్ ఎందుకు రాలేదని అడిగినా, నీకు రేషను కార్డు ఎందుకు రాలేదని అడిగినా వీటన్నిటికీ రాజకీయం జరిగిపోయిందన్న జవాబు వస్తోంది. రాజకీయమంటే కుట్ర, దగా, మోసం, కుతంత్రం అనే అర్థంతో వాడటం నిత్యకృత్యమైపోయింది. ప్రస్తుత నేతలు రాజకీయాలను దిగజార్చి వేయడమే ఇందుకు కారణం.

రాజకీయాలంటే ఏదో విధంగా అధికారాన్ని కైవసం చేసుకోవడమని ప్రస్తుత నాయకుల భావన. ఒక నేతను గద్దెదించి మరోనేత ఎక్కడానికి ధన ప్రలోభాలు చూపడం, ఫిరాయింపులను ప్రోత్సహించడం, మంత్రిపదవులు, కార్పొరేషన్ పదవులు ఆశచూపడం వంటివన్నీ రాజకీయాలుగా చెలామణీ అవుతున్నాయి. బీహార్ శాసన సభ రద్దు, జార్ఖండ్, గోవా పరిణామాలు, కర్ణాటక ముఖ్యమంత్రిని గద్దెదించడం వంటివన్నీ రాజకీయ కుతంత్రాలకు నిదర్శనాలుగా వున్నాయి.

అధికారం సంపాదించడానికి కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టి రాజకీయాలను వ్యాపారంగా మార్చివేసే ధోరణి బలంగా పాతుకుపోయింది. నోట్ల విత్తనాలు చల్లి, ఓట్ల పైరు వేసి, సీట్ల పంట పండించుకుని కోట్ల రూపాయలు కూడబెట్టుకోవడం రాజకీయంగా చెలామణి అవుతోంది. అధికారం లోకి వచ్చాక అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ఖర్చు చేస్తున్న లక్షల కోట్ల రూపాయలలో కాంట్రాక్టర్లనించి, వ్యాపారులనుండి,అధికారుల నుండి వేల కోట్లను దండు కోవడమే రాజకీయంగా కొనసాగుతోంది.

రాజకీయమంటే పెత్తనంగాను, ఒక హోదాగాను భావిస్తున్నారు. అవినీతి బంధుప్రీతి అశ్రిత పక్షపాతం వంటి వాటికి తోడు రౌడీలను పోషించడం మాఫియా ముఠాలను ప్రోత్సహించడం, సాధారణమైపోయింది. , అక్రమ సంపాదన, నేర సామ్రాజ్యాలు ఒక్కటై పోయి ప్రజలను దోచుకోవడానికి అధికారాన్ని వినియోగించడమే రాజకీయమై కూర్చుంది. ఇన్ని అవలక్షణాలతో విరాజిల్లుతుండటం వల్లనే ప్రజలలో రాజకీయాలనే మాట వినగానే ఏహ్యత కలుగుతోంది. మర్యాదస్తులైన వారు రాజకీయాలలో చేరడానికి విముఖత చూపడానికి ఈ క్షీణ రాజకీయ సంస్కృతే కారణం. విద్యాధికులు రాజకీయాలకు దూరంగా ఉండటానికి ఇదే ప్రధాన కారణం. మీ పిల్లల్ని ఏం చేయిద్దామనుకుంటున్నారన్న ప్రశ్నకు డాక్టరో, ఇంజనీరో, సైంటిస్టో, ఐ.టి. ప్రొఫెషనలో, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామరో అనే చెప్పడమే వింటున్నాం తప్ప, పొలిటీషయన్‌ని చేద్దామనుకొంటున్నట్టు ఏ ఒక్కరూ చెప్పకపోవడం యాధృచ్ఛికం కాదు. రాజకీయాల పట్ల ప్రజలలో ఏర్పడిన అసహ్యం, చీదర దీనికి కారణం.

ఎన్నికలలో కోట్లు ఖర్చుపెట్టడం, తిరిగి కోట్లు దండుకోవడం రాజకీయమయ్యింది. ఎన్నికల్లో గెలవడానికి తప్పుడు పనులు చెయ్యడం రాజకీయమయ్యింది. అక్రమ సంపాదనకు రాచమార్గం వేసేది రాజకీయమయ్యింది. పదవిని, అధికారాన్ని తనకోసం తన అనుచరులకోసం వినియోగించడం రాజకీయమయ్యింది. అందుకే మర్యాదస్తులు రాజకీయాలకు దూరమయ్యారు. మంచి చేద్దామనుకునేవారికి అవకాశాలు సన్నగిల్లిపోయాయి. ఈ రాజకీయపతనం మన ప్రజాస్వామ్యానికి చాలా హాని చేస్తుంది. మన దేశానికి చెరుపు చేస్తుంది. ఇది తప్పుడు రాజకీయం. ఇది క్షీణ రాజకీయ సంస్కృతి. మరి ఏది నిజమైన రాజకీయం? ఏది అసలైన రాజకీయం.

పూజ్య బాపూజీ, బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహనీయులు రాజకీయాలను ఒక పవిత్రమైన వ్యాసంగంగా భావించారు. రాజకీయాలంటే త్యాగం, ఆదర్శం, సేవ, అధికారమంటే బాధ్యత అని వారు భావించారు. రాజకీయమంటే పవిత్ర కర్తవ్యమని వారు భావించారు. మీరు మహర్షి, సర్వసంగ పరిత్యాగి కదా, ఈ రాజకీయాల బురద మీకెందుకని గాంధీజీని ఎవరో ప్రశ్నించారట. నీ నిత్యజీవితంలో ఎదురయ్యే ప్రతి సంఘటనకు, ప్రతి సమస్యకు రాజకీయానికి సంబంధముందని, సమస్యల తీగను దేన్ని పట్టుకున్నా రాజకీయమనే డొంక కదులుతుందని గాంధీజీ జవాబిచ్చారు. సమస్యలు పరిష్కరించాలన్నా, జన జీవితాన్ని మెరుగుపరచాలన్నా రాజకీయాలు తప్పనిసరి అని గాంధీజీ స్పష్టం చేసారు.

వ్యక్తి తనంతట తాను చేసుకోలేని సామూహిక వ్యవహారాలను చక్కబెట్టేది రాజకీయం. ఏ వ్యక్తి అయినా తన ఇంటిలో చేసుకోగలిగే పనులకు ఇతరులపై ఆధారపడడు. తనతంట తానే చేసుకోగలడు. కాని ఇల్లు దాటి బైటికి వచ్చాక వ్యక్తికి అవసరమైన పనులన్నీ వ్యవస్థ చెయ్యాల్సిందే. వ్యక్తి సుఖాన్ని సమాజ హితాన్ని అనుసంధానించేది రాజకీయం. ప్రతి వ్యక్తి కోరుకునేది తన సుఖం. మెరుగైన జీవితం. జీవితం మెరుగు పడాలన్న కోరిక, సుఖించాలనే తపన మనిషిని నిరంతరం ముందుకు నడిపిస్తుంటాయి. అయితే వ్యక్తి తన సుఖం కోసం సమాజ హితాన్ని ధ్వంసం చెయ్యకూడదు. అతని సుఖం సమాజహితం పరిధిలో వుండేటట్లు చూడటమే రాజకీయం.

అలాగే అపరిమితమైన ఆకాంక్షలకు పరిమితమైన వనరులకు మధ్య వారధి కట్టేది రాజకీయం. సుఖం కోరుకునే ప్రజలకు ఆకాంక్షలు చాలా వుంటాయి. కోరికలు నిరంతరం పెరుగుతూనే వుంటాయి. అయితే వాటిని తీర్చడానికి అవసరమైన వనరులు తక్కువగా వుంటాయి. అయితే క్షీణ రాజకీయ సంస్కృతిలో వనరులతో సంబంధం లేకుండా ప్రజల కోరికలను రెచ్చగొట్టడం ఒక అలవాటుగా మారింది. అసాధ్యమైన కోరికలను తీర్చుతామంటూ వాగ్ధానాలు చేసి ఓట్లు వేయించుకోవడం మామూలైపోయింది. ప్రజల కోరికలు తీర్చడానికి రాజకీయ నేతలు ఒక అనారోగ్యకరమైన పోటీకి సిద్ధపడుతున్నారు. దాంతో ప్రగతి వక్రమార్గం పడుతుంది. ప్రజల డిమాండ్లు సైతం వక్రమార్గాలకు మళ్ళేటట్లు చేస్తోంది. అందువల్ల స్థిరమైన, నిలకడైన అభివృద్ధికి, ఆరోగ్యకరమైన సామాజిక పురోగతికి ఈ ధోరణి హాని చేస్తోంది.

మన సమాజంలో వివిధ తరగతులకు చెందిన వ్యక్తులున్నారు. వారి మధ్య కులం, మతం, ప్రాంతం, భాష, విద్య, ధనం, వంటి అనేక అంతరాలు, వ్యత్యాసాలు వున్నాయి. కుల వివక్ష, లింగవివక్ష వంటివి

పాతుకుపోయివున్నాయి. సామాజిక అంతరాలను వ్యత్యాసాలను తొలగించి, సామాజిక సామరస్యాన్ని, అభివృద్ధిలో సమతూకాన్ని సాధించాల్సింది రాజకీయం. అయితే ప్రస్తుత రాజకీయనేతలు కులాన్ని, మతాన్ని, ప్రాంతాన్ని, భాషను రెచ్చగొట్టి, ప్రజల మధ్య అంతరాలను పెంచి, సమాజంలో చిచ్చుపెట్టి ఓట్లు వేయించుకోవడానికి వాడుకుంటున్నారు. భావోద్వేగాలను పనిగట్టుకు రెచ్చగొడుతున్నారు. పరిష్కరించాల్సిన సమస్యలను పరిష్కారం కానీయకుండా అడ్డుపడుతున్నారు.

ప్రజల ఆకాంక్షలకు ఒక రూపాన్నిచ్చి, దానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించి, ప్రజల్ని లక్ష్యసాధనవైపు కలిసికట్టుగా నడిపించేది రాజకీయం. వ్యక్తుల, వివిధ తరగతుల ఆకాంక్షలు వేర్వేరుగా వుంటాయి. అందువల్ల వారి మార్గాలు వేర్వేరుగా వుంటాయి. వారు భిన్న దిశలలో సమాజాన్ని నడిపించేందుకు యత్నిస్తుంటారు. దాంతో సరైన దిశా నిర్దేశంలేక సమాజగతి అస్తవ్యస్థమవుతుంది. ప్రస్తుత రాజకీయ నేతలు ఎవరి వద్దకు వెళితే వారి కోరికలను సమర్థిస్తున్నారు. నదీ జలాల వివాదాలు, ప్రాజెక్టుల తగాదాలు, వంటి సమస్యలను పరిశీలిస్తే ఒకే రాజకీయ పార్టీ ఒక ప్రాంతంలో ఒకవైఖరి, మరో ప్రాంతంలో మరో వైఖరి తీసుకోవడం గమనించవచ్చు. అందర్నీ మెప్పించాలన్న కప్పదాటు వైఖరి గా దీన్ని పరిగణించడం సరికాదు. అందర్నీ వంచించే దుర్బుద్ధిగా దీన్ని గుర్తించాలి. అందువల్ల వివిధ తరగతుల, వ్యక్తుల ఆకాంక్షలకు ఒక రూపాన్నిచ్చి, వాటి పరిష్కారానికి తగిన మార్గాలను సూచించి, అందర్నీ కలిసికట్టుగా లక్ష్యసాధనకు నడిపించేదే అసలైన రాజకీయం. సమాజహితం కోసం ప్రభుత్వం ఏర్పాటు చెయ్యడం, ప్రభుత్వాన్ని నిర్వహించడం అందుకోసం ప్రజల్ని సమీకరించడమే 'రాజకీయం'. అందువల్ల రాజకీయాలకు గల అసలైన అర్థాన్ని తిరిగి తీసుకురావాలి. క్షీణ రాజకీయ సంస్కృతిని మార్చాలంటే రాజకీయల పట్ల ప్రజలకు గల అపోహలను తొలగించాలి. రాజకీయాలకు దూరంగా వుండటం ద్వారా, రాజకీయనేతలను తిట్టడం ద్వారా, రాజకీయాలను అసహ్యించుకోవడం ద్వారా రాజకీయాలను మార్చలేం.

రాజకీయమంటే ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకి, పార్టీలకి, వారి కార్యకర్తలకి మాత్రమే సంబంధించిన వ్యవహారం కాదు. ఇది ప్రజలందరికీ సంబంధించినది. ఓటుద్వారా తమ అధికారాన్ని, పన్నులద్వారా తమ సొమ్మునీ ఎవరి చేతుల్లో పెట్టాలో ప్రజలు నిర్ణయించుకోవడమే రాజకీయం. పిల్లల చదువు, కుటుంబ ఆరోగ్యం గ్రామాభివృద్ధి ఎవరు సవ్యంగా చెయ్యగలరో తేల్చుకునేది రాజకీయం. మన గ్రామంలో ఐదేళ్ళలో ఖర్చుకాగల లక్షలాది రూపాయల సొమ్ముని ఎవరి చేతుల్లో పెడితే సద్వినియోగమవుతుందో నిర్ధారించుకునేది రాజకీయం. అందువల్ల ప్రజాస్వామ్యం మనుగడ సక్రమంగా కొనసాగాలన్నా, ప్రజలకు సుపరిపాలన అందించాలన్నా అది మంచి రాజకీయాల ద్వారానే సాధ్యం. అందుకోసం ప్రజలంతా రాజకీయాలలో పాలు పంచుకోవాలి.

ప్రజల క్రియాశీల భాగస్వామ్యం లేనిదే రాజకీయాలు బాగుపడవు. ప్రజలు తలచుకున్నప్పుడల్లా రాజకీయాలు మారాయి. మన స్వాతంత్రోద్యమమే అందుకు చక్కని ఉదాహరణ. తమకు నచ్చని రాజకీయ పక్షాన్ని అధికారం నించి దించేయ్యడంలో ప్రజలు నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తున్న ఉదాహరణలు అనేక ఎన్నికల్లో మనం చూసాం. దైవాంశ సంభూతులనుకున్న వారిని సైతం ప్రజలు మట్టికరిపించారు. ప్రస్తుతం నడుస్తున్న నకిలీ రాజకీయాన్ని, క్షీణ రాజకీయ సంస్కృతిని మార్చగల శక్తి మన ప్రజలకు వుంది.

అందుకే నిజమైన రాజకీయం కోసం, నూతన రాజకీయ సంస్కృతి కోసం మనం నడుం బిగించాలి. మంచి రాజకీయాల వల్ల ప్రయోజనం పొందే వారందరినీ ఏకం చెయ్యలి. యువత, మహిళలు, దళిత, బడుగు బలహీన వర్గాలకు మంచి రాజకీయాల వల్ల కలిగే మేలును వివరించాలి. వారంతా గట్టి నిర్ణయంతో ముందుకు వచ్చిన నాడు మన రాజకీయాలు తప్పనిసరిగా మారతాయి. ✪

# గ్రామ పంచాయితీ ఎన్నికలు

## అర్హతలు – అనర్హతలు

1. సర్పంచు - ప్రత్యక్షంగా ప్రజలచే ఎన్నుకోబడతారు
2. వార్డు సభ్యులు - ప్రత్యక్షంగా ప్రజలచే ఎన్నుకోబడతారు.
3. ఉప సర్పంచు - పరోక్ష పద్ధతి (వార్డు మెంబర్లు తమలో ఒకరిని ఎన్నుకుంటారు.)

**అర్హతలు**

1. పై పదవులలో పోటీ చేసే వ్యక్తికి సంబంధిత గ్రామ పంచాయితీ ఓటర్ల జాబితాలో తన పేరు నమోదైఉండాలి. (సె.17)
2. పోటీ చేసే వ్యక్తి, వయస్సు 21 సం. నిండాలి (సె.17)

**అనర్హతలు**

1. ప్రభుత్వోద్యోగి అయి ఉండరాదు (సె.18)
2. ఏ కోర్టు చేతనూ నేరస్తులుగా నిర్ధారించబడి ఉండరాదు. ((సె.19(1)).
3. 30-5-1995 తరువాత ఇద్దరికి మించి పిల్లలుండరాదు. (సె.19 (3))
4. ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 9 (ఎ) అధ్యాయం క్రింద దోషిగా ప్రకటించబడిన వ్యక్తి మరియు ఎన్నికల దావాలోని తీర్పు ప్రకారం అవినీతి చర్యలకు పాల్పడినట్లు రికార్డు చేయబడిన వ్యక్తి-పోటీ చేయుటకు అనర్హుడు (సె.19 (ఎ))
5. గత ఎన్నికల ఖర్చు ఎకౌంటును గడువులోపు దాఖలు చేయక అనర్హతల వేటు పడినవారు.
6. మతిస్థిమితం లేనివారు, చెవిటివారు, మూగవారు అనర్హులు
7. కోర్టుచే దివాలాదారుగా ప్రకటించబడినవారు .
8. గ్రామ పంచాయతీ కాంట్రాక్టు వ్యవహారములలో సంబంధం కలిగియున్న వారు.
9. గ్రామసభను సంవత్సరానికి రెండుసార్లు జరపని కారణంగా పదవిని కోల్పోయినవారు.
10. ఆడిట్‌ను సం॥లోగా జరపని కారణంచేత పదవిని కోల్పోయినవారు.

# సూక్తులు

1. బలం అందరకూ ఉంటుంది. సంకల్ప బలం మాత్రం కొందరికే ఉంటుంది.

   - విక్టర్ హ్యూగో

2. ప్రైవేటు వ్యక్తులు నిర్వహించే సభలను, సమావేశాలను బట్టి ఆ దేశంలోని ప్రజాస్వామ్యం స్థాయిని నిర్ణయించవచ్చు.

   - అలెగ్జీ డీటాక్వెలీ

3. సాధారణ మనుషుల్లో కూడా అసాధారణ శక్తులున్నాయన్న విశ్వాసమే ప్రజాస్వామ్యానికి పునాది.

   - ఫోస్టిక్

4. నువ్వు అది చేయలేవు, ఇది చేయలేవు అని నిన్ను నిరుత్సాహపరచే వాళ్ల మాటలు వినొద్దు.

   -డగ్లస్ బాడర్

5. నేను పోరాడిఓడిపోతానే కానీ ఎన్నటికీ లొంగిపోను.

   - సామ్యుయెల్ జాన్సన్

:6. నిరంతరం నేర్చుకుంటే తప్ప ఉపాధ్యాయుడనే వాడు నిజంగా మరొకరికి విద్య నేర్పలేడు.

   - ఠాగూర్

7. తెలివివున్న వాళ్ల శాంతి సమయంలోనే యుద్ధ సన్నాహాలు చేసుకుంటారు.

   - హోరేస్

8. పర్వతం మహమ్మద్ దగ్గరకు రాకపోతే మహమ్మదే పర్వతం దగ్గరకు పోవాలి.

   - మహమ్మద్

9. ఏమీ తెలియని వాడికి సందేహం తలెత్తే సమస్యే ఉండదు.

   - జార్జ్‌హెర్బర్ట్

10. ఏ తరహా సందేహాన్నయినా చర్య ద్వారానే నివృత్తి చేయాలి.

   -థామస్ కార్లైల్

# టీచర్‌గా సేవలందిస్తున్న సర్పంచి

ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ప్రైవేటు స్కూళ్లకు దీటుగా విద్యా బోధన జరిగినప్పుడే నిరుపేద, మధ్య తరగతి విద్యార్థులు మంచి ఫలితాలను సాధిస్తారని నమ్మే సర్పంచ్ ఆయన!... అందుకే ఆ దిశలో తనవంతు బాధ్యతగా తన సొంత ఊర్లోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా మారారు. ఇందుకోసం రోజుకు గంట సమయం కేటాయిస్తున్నారు. మొన్నటి దాకా పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు తీసుకున్న ఆయన ప్రస్తుతం తొమ్మిదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఆయనే సరూర్‌నగర్ మండలం బాలాపూర్ గ్రామ సర్పంచ్ ఇబ్రాం శేఖర్. ప్రభుత్వ పాఠశాలలో ఆయనే స్వయంగా పాఠాలు చెబుతున్నారు.

### ఆరు నెలలుగా ...

సర్పంచ్ శేఖర్ అరు నెలలుగా ఇక్కడి హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థులకు గణిత శాస్త్రంలో తరగతులు తీసుకుంటూ విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే రీతిలో చెబుతున్నారు. సర్పంచ్ ఈ పాఠశాలలో తరగతులు తీసుకునే సమయానికి కొందరు విద్యార్థులకు ఇంగ్లీషులో ఎబిసిడిలు కూడా రాకపోవడం గమనార్హం. బాలాపూర్ సర్పంచ్‌గా, రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శిగా, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉంటూ కూడా ఆయన రోజుకో గంటపాటు స్కూలులో విద్యా బోధన చేయడం విశేషం.

ప్రభుత్వ పాఠశాలల్లో రోజురోజుకూ విద్యా ప్రమాణాలు దిగజారుతుండడం ఆందోళన కలిగిస్తున్నదని ఆయన అన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు వెళ్ళి విద్యనభ్యసించలేని పేద కుటుంబాలకు చెందిన పిల్లలే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతుంటారని, అయితే ఇక్కడ కూడా విద్యా బోధన సరిగా లేక వారు సరైన విద్యను అందుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### సొంతంగా గ్రంథాలయం ఏర్పాటు ....

బాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో సర్పంచ్ శేఖర్ తన తండ్రి లింగయ్య స్మారకార్థం విద్యార్థుల కోసం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయించారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ఫర్నిచర్, ర్యాక్‌లు సమకూర్చారు. ప్రస్తుతం ఈ గ్రంథాలయం విద్యార్థులకు రాత్రి సమయాల్లో కూడా ఉపయోగపడుతోంది. ఇంట్లో చదువుకునే వెసులుబాటు లేని పిల్లలు దీన్ని వినియోగించుకుంటున్నారు.

### మాకు ప్రోత్సాహంగా ఉంది. : ప్రధానోపాధ్యాయుడు

పాఠశాలలో సర్పంచ్ తరగతులు తీసుకోవడం తమకు ప్రోత్సాహంగా ఉందని బాలాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనంతరెడ్డి పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో ఇలాంటి విద్యావంతులైన, ఉత్సాహవంతులైన సర్పంచులు ఉంటే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందగలవన్నారు.

## తెలుసుకోదగ్గ సమాచారం

# ఆరోగ్య ఉపకేంద్రాలకు
## జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు

జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఆరోగ్య ఉప కేంద్రానికి పదివేల రూపాయల చొప్పున గ్రామ పంచాయతీలకు విడుదల చేశారు. ఈ డబ్బును గ్రామ సర్పంచ్, ఆరోగ్య ఉపకేంద్రంలోని ఎఎన్ఎంల జాయింట్ ఖాతాలో జమచేసి, నిర్దేశించిన ప్రజావసరాలకు ఖర్చు చేయాలి. గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రభవనం మరమ్మత్తులకు, గర్భిణీలను పరీక్షించేందుకు వసతుల కల్పనకు, తాగు నీటి వనరులను శుభ్రపరచడానికి, నివాస ప్రాంతాల్లోని చెత్తాచెదారం తొలగించడానికి, డిడిటి పౌడర్లు చల్లడానికి ఈ నిధుల్ని వాడుకోవచ్చు. గ్రామ పంచాయతి ఆరోగ్య సంఘంలో చర్చించి ఆమోదించాకనే వీటిని ఖర్చు చేయాల్సి ఉంటుంది.

# గ్రామ పంచాయతీలో సిటిజన్స్ ఛార్టర్

**(పౌర హక్కుల పత్రం)**

| క్ర. సం | I. ధృవీకరణ పత్రాలు | కాలపరిమితి |
|---|---|---|
| 1. | స్వగ్రామ ధృవీకరణ పత్రము జారీ | 02 రోజులు |
| 2. | నివాస ధృవీకరణ పత్రము జారీ | 02 రోజులు |
| 3. | కుల ధృవీకరణ పత్రము జారీ చేయుటకు సమర్ధాధికారికి సిఫారసు | 02 రోజులు |
| 4. | ఆదాయ ధృవీకరణ పత్రము జారీ చేయుటకు సమర్ధాధికారికి సిఫారసు | 02 రోజులు |
| 5. | జనన మరణ ధృవీకరణ పత్రముల జారీ ప్రభుత్వ ఉత్తర్వు నెం. 236 పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి (మం.2) శాఖ, తేది 13.07.2002 ప్రకారము) | 05 రోజులు |

## II. ఇతర పౌర సేవలు

| | | |
|---|---|---|
| 1. | జనన మరణాల రిజిస్ట్రేషన్ | 03 రోజులు |
| 2. | ఆస్తి పన్ను గణన, ఇంటి నెంబరు కేటాయింపు | 15 రోజులు |
| 3. | భవన నిర్మాణ దరఖాస్తు పరిష్కారము | |
| 4. | నీటి సరఫరా మంజూరు | |
| 5. | సమర్థాధికారికి లే అవుట్లు సిఫారసు | 15 రోజులు |
| 6. | ఆస్తి బదలాయింపు (మార్పిడి) | 15 రోజులు |
| 7. | లైసెన్సుల జారీ | 05 రోజులు |
| 8. | పహాణి / అడంగల్ | 02 రోజులు |

## III. ఇబ్బందుల తొలగింపు (నివారణ)

| | | |
|---|---|---|
| 1. | పైపులైను లీకేజీ మరమ్మత్తులు | 24 గంటలు |
| 2. | చేతిపంపుల మరమ్మత్తులు | 3 రోజులు |
| 3. | వీధి దీపములు, పోయిన బల్బులు / ట్యూబులు బదులు కొత్తవి అమర్చుట | 02 రోజులు |
| 4. | నిలిచిపోయిన మురుగు కాల్వలు, గుంటలపై ఫిర్యాదు | 02 రోజులు |
| 5. | రోడ్లు కోతలు, గుంతలపై ఫిర్యాదులు | 03 రోజులు |
| 6. | చెత్త కుండీల శుభ్రత గురించిన ఫిర్యాదులు | 02 రోజులు |
| 7. | పంచాయతీకి, ప్రభుత్వానికి సంబంధించి చెల్లించాల్సిన బకాయిల వివరములతో సమాచారము | 05 రోజులు |

సేవలు వినియోగించుకొనుటకు ప్రతి సేవా కేంద్రంలోని నోటీసుబోర్డుపై గ్రామ పంచాయతీలు, దరఖాస్తు దారులు అనుసరించవలసిన పద్ధతుల గురించి ప్రదర్శించవలెను.

## పౌరసేవా కేంద్రాల అమలు యంత్రాంగము

గ్రామ పంచాయతీల సేవల కోరు ప్రతి పౌరుడు ఒక దరఖాస్తును అవసరమైన ఆధారపత్రములు జతపరిచి పౌరసేవ కేంద్రములో సాధారణంగా ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నము 1.00 గంట మధ్యన సమర్పించవలసి వుంటుంది. స్థానికంగా ప్రజానుకూలముననుసరించి గ్రామ పంచాయతీ పై సమయమును ప్రకటించవచ్చు.

పౌరసేవా కేంద్రం బాధ్యత వహించు సహాయకుడు దరఖాస్తు ముట్టినట్లు తేదీ, సమయముతో రశీదు జారీ చేయవలయును. తదనంతరము అందుకు నిర్దేశిత సమయసారిణి ప్రకారం ఆమె / అతను అనుమతి / ధృవీకరణ పత్రము / సేవ అట్టి సేవా కేంద్రము నుండి పొందవచ్చును. సేవా కేంద్రముల నుండి ప్రతిరోజు సాయంత్రం 3.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు అనుమతులు ధృవీకరణ పత్రములు / లైసెన్సు జారీచేయాలి.

దరఖాస్తుల స్వీకరణ సమయములోనే పౌరుడు పూర్తి వివరములు సమర్పించునట్లు వారికి గ్రామ పంచాయతీ సహాయమందించాలి. I, II పట్టికలలో సేవలందించుటలో సమయసారిణిని అనుసరించేటట్లు చూడడానికి నిర్దేశిత వ్యవధికి మించి దరఖాస్తు దారునికి జాప్యము జరిగినపుడు వారి విలువైన సమయమును వెచ్చించినందుకు దరఖాస్తుదారునికి గ్రామ పంచాయతీ నిధినుండి రోజుకు రూ. 10/- చొప్పున టోకెన్ పరిహారము చెల్లించవలసినదిగా పంచాయతీలను ఆదేశించడమైనది. ఆ పరిహారం సంబంధిత ఉద్యోగిజీతం నుండి మినహాయించాలి.

# జనాభా గణాంకాలు (2001)

| | | అంశం | ఆంధ్రప్రదేశ్ | భారతదేశం |
|---|---|---|---|---|
| 1 | విస్తీర్ణం | (000.చ.కి.మీ) | 275 | 3287 |
| 2. | జనాభా | (కోట్లలో | 7.6 | 102.86 |
| 3. | పురుషులు | (%) | 50.6 | 51.73 |
| 4. | స్త్రీలు | (%) | 49.4 | 48.27 |
| 5. | స్త్రీలు | | | |
| | ప్రతి 1000 మంది పురుషులకు | (నెం.) | 978 | 933 |
| 6. | పట్టణ జనాభా | (%) | 27.3 | 27.8 |
| 7. | జనసాంద్రత | (చ.కి.మీ.కి) | 277 | 313 |
| 8. | షెడ్యూలు కులాలు | (%) | 16.19 | 16.2 |
| 9. | షెడ్యూలు తెగలు | (%) | 6.59 | 8.2 |
| 10. | అక్షరాస్యత శాతం | (%) | 60.5 | 64.8 |
| | (ఎ) పురుషులు | (%) | 70.3 | 75.3 |
| | (బి) స్త్రీలు | (%) | 50.4 | 53.7 |
| 11. | కుటుంబాల సంఖ్య | (000) | 17004 | 193580 |
| | (ఎ) గ్రామీణ | (%) | 74 | 71 |
| | (బి) పట్టణ | (%) | 26 | 29 |

## కొన్ని ముఖ్య గణాంకాలు

| | | ఆంధ్రప్రదేశ్ | భారతదేశం |
|---|---|---|---|
| **1.** | **జననాలు (ప్రతి 1000 మంది జనాభాకి)** | | |
| | మొత్తం | 20.4 | 25.0 |
| | గ్రామీణ | 20.9 | 26.6 |
| | పట్టణ | 19.1 | 20.0 |
| **2.** | **మరణాలు (ప్రతి 1000 మంది జనాభాకి)** | | |
| | మొత్తం | 8.0 | 8.1 |
| | గ్రామీణ | 8.8 | 8.7 |
| | పట్టణ | 5.4 | 6.1 |
| **3.** | **శిశు మరణాలు రేటు (ప్రతి 1000 సజీవ జననాలకి)** | | |
| | మొత్తం | 59 | 63 |
| | గ్రామీణ | 67 | 69 |
| | పట్టణ | 33 | 40 |
| **4.** | **జనన ప్రాతిపదికగా ఆయుఃప్రమాణం** | | |
| | పురుషులు | 62.8 | 63.9 |
| | స్త్రీలు | 65.0 | 66.9 |